క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

నాదెండ్ల: గుంటూరు-కర్నూలు రాష్ట్రీయ రహదారిపై సాతులూరు వద్ద ఆగిఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి మినీ వ్యాన్ ఢీకొన్న ఘటనలో డ్రైవర్ గాయపడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విశాఖ జిల్లా మధురవాడ నుంచి వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు వెళ్తున్న ఆర్టీసీను బస్సు గురువారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో ప్రయాణికుల కాలకృత్యాలు తీర్చుకునేందుకు డ్రైవర్ రోడ్డు పక్కన నిలిపాడు. ఈ సమయంలో గుంటూరు వైపు నుంచి త్రిపురాంతకం వెళ్తున్న మినీ వ్యాన్ వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ఘటనలో వ్యాన్ డ్రైవర్ మస్తాన్‌వలి గాయపడ్డాడు. అతడ్ని 108 వాహనంలో నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మినీ వ్యాన్ ముందుభాగం పూర్తిగా ధ్వంసమైంది. ఎస్ఐ భాస్కర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

వినుకొండ(నూజెండ్ల) : నూజెండ్ల మండలంలోని పెద్దవరం, ఐనవోలు, పాత జడ్డవారిపాలెం గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్ని ఏపీవో కట్టా నాగేశ్వరరావు తనిఖీ చేశారు. కూలీల మస్టర్స్, పని ప్రదేశాల్లో నీడ, సౌకర్యాల్ని పరిశీలించారు. వేసవిలో అందుతున్న వసతుల గురించి కూలీల్ని అడిగి తెలుసుకున్నారు. టీఏలు సతీష్‌రెడ్డి, సింగయ్య, శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

వినుకొండ(నూజెండ్ల) : పండ్ల తోటల పెంపకం కోసం రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో జిలానీ బాషా తెలిపారు. నూజెండ్ల మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పండ్ల తోటలు వేసుకునేందుకు 70 ఎకరాలు టార్గెట్ ఇచ్చారన్నారు. నిమ్మ, బత్తాయి, దానిమ్మ, మామిడి, జామ, డ్రాగన్ ఫ్రూట్, గులాబీ తోటలు వేసుకునేందుకు రైతులు శనివారంలోపు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, ఎంపీడీవో, ఏపీవో, ఫీల్డ్ అసిస్టెంట్స్‌కు దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. ఏపీవో కట్టా నాగేశ్వరరావు మాట్లాడుతూ రోడ్డు పక్కన 2500, సచివాలయాల వద్ద 50 మొక్కలు నాటాలని చెప్పారు. మునగ మొక్కలు, బ్లాక్ ప్లాంటేషన్ తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు చెల్లని చెక్కు కేసుల్లో జరిమానా, జైలుశిక్ష

వినుకొండ(నూజెండ్ల): చెల్లని చెక్కు కేసులో రూ.8లక్షల జరిమానా, రెండు సంవత్సరాలు జైలుశిక్ష విధిస్తూ వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి యు.రామ్మోహన్ గురువారం తీర్పు నిచ్చారు. వినుకొండ పట్టణానికి చెందిన పఠాన్ దుర్వేష్‌ఖాన్, వినుకొండ మండలం వెంకుపాలెం గ్రామానికి చెందిన అడపాల రత్తయ్యకు ఆర్థికలావాదేవీల అంశమై చెక్కులు ఇచ్చారు. ఆయన వాటిని బ్యాంక్‌కు సమర్పించగా నగదు లేని కారణంగా చెల్లుబాటు కాలేదు. దీంతో ఫిర్యాదుదారుడు రత్తయ్య వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 2016లో కేసు వేశారు. విచారణ పూర్తయిన అనంతరం బుధవారం న్యాయమూర్తి యు.రామ్మోహన్ తీర్పు చెప్పారు. దుర్వేష్‌ఖాన్‌కు రూ.8లక్షల జరిమానాతో పాటు రెండు సంవత్సరాల జైలుశిక్ష విధించారు.

నరసరావుపేట టౌన్: చెల్లని చెక్కు కేసులో నిందితుడికి తొమ్మిది నెలల జైలుతో పాటు రూ.5.35 లక్షల పరిహారం చెల్లించాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఓ. వెంకట నాగేశ్వరరావు గురువారం తీర్పు చెప్పారు. పట్టణానికి చెందిన వేములపాటి కోటిరెడ్డి వద్ద పి. రమేష్ 2014లో రూ.5 లక్షల్ని అప్పుగా తీసుకున్నాడు. చెల్లింపులో భాగంగా చెక్కు అందజేశాడు. ఖాతాలో నగదు లేక చెల్లుబాటు కాకపోవడంతో బాధితుడు కోర్టును ఆశ్రయించాడు. నేరం రుజువు కావడంతో 2021 ఫిబ్రవరి 26న మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి తొమ్మిది నెలల జైలు, ఫిర్యాదుదారుడికి రూ.5.35 లక్షల పరిహారం అందజేయాలని తీర్పు చెప్పారు. నిందితుడు జిల్లా కోర్టుకు అప్పీలు చేసుకోవడంతో దిగువ కోర్టు విధించిన తీర్పును యథావిధిగా అమలు చేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

నాడు-నేడు పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలి

బొల్లాపల్లి : పాఠశాలల్లో నాడు-నేడు పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో టి.పార్వతి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పాఠశాలల అభివృద్ధిపై ఆమె ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 48 పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం సెకండ్ ఫేజ్‌లో కేటాయించిన నిధుల వినియోగాన్ని సమీక్షించారు. పలు పాఠశాలల్లో 63 అదనపు తరగతి గదులకు రూ.7కోట్లు, మూడు అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి రూ.48లక్షలు, 26 పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి పనులకు గాను రూ.4.43కోట్లు, నాలు పాఠశాలలకు అదనపు తరగతి గదులతో పాటు మౌలిక వసతుల అభివృద్ధి పనులకు గాను రూ.1.98 కోట్లు కేటాయించినట్లు వివరించారు. పాఠశాలలు పునః ప్రారంభించే సమయంలోగా ఆయా పాఠశాలల్లో పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈవో వి.ఏసుబాబు, పీఆర్ ఏఈ షేక్ అల్లాబక్షు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ సహాయకులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు కిరణ్‌రాజు తదితరులు

వినుకొండ(నూజెండ్ల) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికలాంగుల చట్టాన్ని అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు కిరణ్‌రాజు పేర్కొన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2016 ఏప్రిల్ 19న కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విభిన్న ప్రతిభావంతుల చట్టాన్ని పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిందని తెలిపారు. ఈ చట్టంలోని 51 నిబంధనల్ని అమలు చేస్తూ వికలాంగుల హక్కుల్ని కూడా కాపాడుతున్నట్లు చెప్పారు. దీనికి కృతజ్ఞతగా రాష్ట్ర వ్యాప్తంగా ఆత్మీయ అభినందన సభలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వికలాంగుల కోఆర్డినేటర్ కొమ్మిరెడ్డి శివారెడ్డి మాట్లాడుతూ వికలాంగులకు రక్షణ కల్పించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హక్కుల చట్టాన్ని అమలు చేయడాన్ని అభినందించారు. రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా వికలాంగుల్ని ఐక్యం చేసి 2024లో ప్రభుత్వం విజయానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు శ్రీనివాసరావు, ప్రభాకర్, దాట్ల అంజిరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజల కోసమే శ్రీ లక్ష్మీ మహా యజ్ఞం



ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దేవదాయ శాఖ ప్రతినిధులు

నరసరావుపేట: రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజలు సుభిక్షంగా, ఆరోగ్యంగా ఉండాలనే ఆకాంక్షతో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మహా యజ్ఞం నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్ర దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించే అష్టోత్తర శతకుండాత్మక (108) చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహాయజ్ఞంలో పాల్గొనాల్సిందిగా ప్రభుత్వం నుంచి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి గురువారం ఆహ్వానం అందింది. ఈ మేరకు దేవదాయ సంస్థకు చెందిన ప్రతినిధులు పార్టీ కార్యాలయంలో ఆయన్ను కలసి ఆహ్వాన పత్రికను అందజేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం చేస్తున్న శ్రీ లక్ష్మీ మహాయజ్ఞంలో ప్రజలు, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

అసమానతలు తొలిగే వరకు పోరాటం



ఎండుగుంపాలెంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

నాదెండ్ల: ఆర్థిక అసమానతలు తొలగి, అందరికీ సమాన అవకాశాలు, గౌరవం దొరికే వరకూ కమ్యూనిస్టు పార్టీలు కృషి చేస్తాయని సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ చెప్పారు. సీపీఐ ఆధ్వర్యంలో మండలంలోని ఎండుగుంపాలెంలో అరుణ పతాక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. రామసుబ్బాయమ్మ సీపీఐ పతాకాన్ని ఎగురవేశారు. మేడే విశిష్టత, కార్మిక హక్కులు గురించి వివరించారు. మతం పేరుతో ప్రజల్ని మాయచేసి దేశాన్ని దోచుకుంటున్న నేరగాళ్లపై ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. కార్మిక హక్కుల్ని హరిస్తూ, శ్రమ దోపిడీకి తలుపులు తెరుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎనిమిది గంటల పని, కనీస వేతనాలు వంటి కార్మికుల హక్కుల్ని ప్రభుత్వాలు పరిరక్షించాలని కోరారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకులు పర్వతనేని హనుమంతరావును శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పేలూరి రామారావు, తాళ్లూరి బాబూరావు, బొంతా నాగేశ్వరరావు, లలితకుమారి, శివలీల, నరసమ్మ, బొంతా శేషయ్య, కొండలరావు, ముప్పాళ్ల అమరలింగేశ్వరరావు, భగత్‌సింగ్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో రైతులకు మేలు

శావల్యాపురం: భూసార పరీక్షలు చేయించడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని ఏఈవో పురేటి అశోక తెలిపారు. మండలంలోని పిచికలపాలెం రైతు భరోసా కేంద్రంలో గురువారం ఖరీఫ్ సమాయత్తంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈవో అశోక మాట్లాడుతూ భూమిలో పోషకాల శాతం పెరగడానికి ప్రభుత్వం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల్ని ముందుగానే రైతుభరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. రసాయనిక ఎరువుల్ని అధికంగా వినియోగించడం వల్ల భూమిలో పోషకాలు తగ్గుతాయని తెలిపారు. కౌలు రైతులంతా తప్పక గుర్తింపు కార్డులు పొందాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరివీధి రమణారావు, మండల పశువైద్యాధికారి రావెళ్ల సురేష్, వ్యవసాయ సహాయకులు కె.బాలాజీ, రైతులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగు సమాయత్తంపై రైతులకు అవగాహన

ఈపూరు : మండలంలోని అంగలూరు, కొచ్చర్ల గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్ సాగు సమాయత్తంపై గురువారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ విస్తరణ అధికారి బి.అప్పారావు మాట్లాడుతూ సాగు మొదలయ్యే ముందుగా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువుల్ని ఆర్‌బీకే కేంద్రాల్లో ముందుగానే అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. కౌలు రైతులు తప్పనిసరిగా గుర్తింపు కార్డుల్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగలూరు గ్రామ సర్పంచ్ సన్నెబోయిన ఏడుకొండలు, ఈపూరు సొసైటీ డైరెక్టర్ గోలి ఏడుకొండలు, గ్రామ వ్యవసాయ సహాయకురాలు బి.గాయత్రి, కె.కిషోర్, రైతులు పాల్గొన్నారు.

పోట్లూరులో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామ సచివాలయం పరిధిలోని ఆరోగ్య ఉప కేంద్రంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ సేవలు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం రోగులకు సేవలందించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగుల ఇళ్లకు వెళ్లి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, అశ్రద్ధ వహిస్తే పక్షవాతం, గుండెపోటుకు గురవుతారని తెలిపారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శిరీష, ఆరోగ్య కార్యకర్త విజయలక్ష్మి, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ అందరి బాధ్యత



బొల్లాపల్లి : పర్యావరణహిత జీవన విధానంలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని నాయుడుపాలెం సెక్షన్ పరిధిలో అటవీ సంరక్షణపై జీఆర్‌వో ఎం.సురేంద్ర బాబు ఆధ్వర్యంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన జీవన విధానం, సుస్థిర ఆహార పద్ధతుల అవలంబన, నీరు, ఇంధనం పొదుపు, ప్లాస్టిక్ వాడకం, ఎలక్ట్రానిక్ వ్యర్థాల నియంత్రణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అటవీ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల్ని పడేయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. అటవీ సంరక్షణలో ఆయా గ్రామాల ప్రజల్ని భాగస్వాములను చేస్తూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ దాడులు



పెదకూరపాడు: పెదకూరపాడు గ్రామంలో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అధికారి కె.ఎల్.ఎస్.మూర్తి ఆధ్వర్యంలో 37 బృందాలు గ్రామంలోని 2,900 సర్వీసులను తనిఖీ చేశాయి. తనిఖీల్లో విద్యుత్ చోరీకి పాల్పడుతున్న నలుగురిపై కేసు నమోదు చేశారు. అధిక లోడు వినియోగిస్తున్న 60 సర్వీసులకు రూ.3.50 లక్షలు జరిమానా విధించినట్లు మూర్తి తెలిపారు. దాడుల్లో ఏడీఈ సురేంద్రబాబు, తులసిరామ్, కోటేశ్వరరావు, విజిలెన్స్ ఎస్సై బాబు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగుకు భూములు సిద్ధం చేసుకోవాలి



మాదలలో జరిగిన ఖరీఫ్ సాగు సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ అరుణ

మాదల(ముప్పాళ్ళ): పచ్చిరొట్ట సాగుకు పొలాలను సిద్ధం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎమ్.అరుణ చెప్పారు. మాదల గ్రామంలోని రైతుభరోసా కేంద్రంలో ఖరీఫ్‌సాగు సన్నాహక సమావేశం గురువారం నిర్వహించారు. ఏఓ అరుణ మాట్లాడుతూ ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వేసవిలో పొలాల్ని ఖాళీగా ఉంచకుండా మినుము, కొర్రల్లాంటి స్వల్పకాలిక పంటలు సాగు చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో వీఏఏ పావని, శైలజ పాల్గొన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 50శాతం సబ్సిడీపై జనుము, జీలుగ, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట విత్తనాలు అందించనున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ తెలిపారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలతో ఆయా రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించాలని ఆమె సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులు చేరేలా ప్రణాళిక



అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారుల వివరాలు నమోదు చేసుకుంటున్న హెచ్‌ఎం గురులింగం

నాదెండ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరానికి చిన్నారులు గణనీయంగా చేరేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఆయా పాఠశాలల హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నెల 8 నుంచి జూన్ 9 వరకూ ఐదు వారాల్లో ఉపాధ్యాయులు చేపట్టాల్సిన అంశాలపై వివరాలు అందజేసింది. ఈ నెల 8 నుంచి 12 వరకు ఒకటో తరగతిలో చేరేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల్ని గుర్తించడం, 15 నుంచి 19 వరకు ఆన్‌లైన్‌లో నమోదు, 22 నుంచి 26 వరకు బడి బయటి పిల్లల్ని గుర్తించడం, 29 నుంచి జూన్ 2 వరకూ డ్రాపవుట్స్‌ను గుర్తించి వివరాల్ని సమీప పాఠశాలల్లో అందించడం, 5 నుంచి 9 వరకు డ్రాపవుట్ తిరిగి పాఠశాలల్లో చేరేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టింది. గణపవరం రాజీవ్‌గాంధీకాలనీ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రాన్ని కార్యకర్తలతో కలసి హెచ్‌ఎం ఎ. గురులింగం సందర్శించారు. 20 మంది చిన్నారుల్ని గుర్తించారు. వారిని సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

దోమల నివారణలో ప్రజా భాగస్వామ్యం ముఖ్యం

పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్



పట్టణంలో పర్యటించి సూచనలు చేస్తున్న రవీంద్ర రత్నాకర్

సత్తెనపల్లి: దోమల నివారణలో ప్రజల భాగస్వామ్యం ముఖ్యమని పల్నాడు జిల్లా మలేరియా అధికారి కె.రవీందర్ రత్నాకర్ చెప్పారు. జనవరిలో పట్టణంలోని బోయ కాలనీ నివాసి మల్లా రామకోటయ్య డెంగీ బారిన పడి కోలుకోవడంతో గురువారం జోనల్ మలేరియా అధికారి డాక్టర్ వినోద్ కుమార్ ఆయన ఇంటి పరిసరాలను పరిశీలించారు. రామకోటయ్య ఇంటిని సందర్శించి సూచనలు చేశారు. ఇంటిలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ఫ్రైడే డ్రైడేగా పాటించాలని, నీటిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల వల్ల అనేక వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే దోమలను నివారించవచ్చని వివరించారు. అనంతరం వెంగళరెడ్డి నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను వైద్యాధికారిణి డాక్టర్ సిరాజున్నిసాను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌ను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో జోనల్ మలేరియా కార్యాలయ ఆరోగ్య విస్తరణాధికారి బి.మంగరాజు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ నాగరాజు, పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి సిహెచ్ ప్రభాకర్ రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్స్ బి.రోశయ్య, వై రాజేష్ పాల్, హెల్త్ అసిస్టెంట్లు ఎంపీ కిరణ్ బాబు, ఎస్ఎం హుస్సేన్, షరీఫ్, హెల్త్ సెక్రటరీ ఎ.భూలక్ష్మి, ల్యాబ్ అసిస్టెంట్ షేక్ బికారి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతనాలు వెంటనే చెల్లించాలి



రెంటపాళ్ళలో పనిప్రదేశం వద్ద కూలీలతో మాట్లాడుతున్న లక్ష్మీశ్వర రెడ్డి

సత్తెనపల్లి: ఉపాధి హామీ పథకం కూలీలకు వేతనాలు ఎప్పటికప్పుడు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల రక్షణ కోసం పని ప్రదేశాల వద్దకు గురువారం ఆయన వెళ్లారు. రెంటపాళ్ళ, కందులవారిపాలెం గ్రామాలలో పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూలీల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 22న నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయం వద్ద తమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం సత్తెనపల్లి మండల కార్యదర్శి జమలమూడి భగత్, బగ్గి వెంకటేశ్వర్లు, చలువాది లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

202 హెక్టార్లలో వరి పంటకు నష్టం

నకరికల్లు: ఇటీవల కురిసిన అకాలవర్షాలకు 205 మంది రైతులకు చెందిన 202.8 హెక్టార్లలో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు గుర్తించామని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. మండలంలోని చీమలమర్రి గ్రామంలో గురువారం ఖరీఫ్ సాగుకు సమాయత్తం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలకు చీమలమర్రి, చల్లగుండ్ల, దేచవరం, కండ్లకుంట, రూపెనగుంట్ల, చాగల్లు తదితర గ్రామాల్లో పంట నష్టపోయిన రైతుల జాబితాను శుక్రవారం నుంచి మూడురోజుల పాటు సచివాలయాల్లో, రైతుభరోసా కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్టు వెల్లడించారు. అభ్యంతరాలు ఉన్నట్టయితే తెలియజేయాలని సూచించారు. 50శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను రైతుభరోసా కేంద్రాల్లో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ-పంట నమోదు, ఉచిత పంటల బీమా గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు జి.జగదీష్, వెటర్నరీ అసిస్టెంట్ సీహెచ్.తిరుపతయ్య, కార్యదర్శి ఎం.శైలేంద్రకుమార్, ఎంపీటీసీ సభ్యుడు తిరుమలశెట్టి సాంబయ్య పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను పారదోలదాం.. పర్యావరణాన్ని కాపాడదాం



శివాపురంతండాలో పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

నకరికల్లు: ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టి పర్యావరణ పరిరక్షణకు నడుంకడదామని అటవీశాఖ డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ నీలిమాదేవి సూచించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో గురువారం శివాపురంతండాలో పర్యావరణ పరిరక్షణ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత అతిథులు, గ్రామస్తులు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవుతామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం నీలిమాదేవి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ పురుషోత్తంరాజు, మండల ఉపాధ్యక్షులు దూదేకుల హుస్సేన్‌బీబాషా, సర్పంచ్ ధ్వాళీబాయి, సక్రునాయక్, ఉపసర్పంచ్ మోహన్‌నాయక్, రమావతు ధర్మానాయక్, యూత్ అధ్యక్షుడు జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో రాడ్ బెండింగ్ మేస్త్రి మృతి



సత్తెనపల్లి: రాడ్‌బెండింగ్ మేస్త్రీ అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన సత్తెనపల్లి పట్టణంలోని జలవనరుల శాఖా కార్యాలయం ఆవరణలో జరిగింది. గురువారం పట్టణ పోలీసులు అతడి మృతదేహాన్ని గుర్తించారు. రాజుపాలెం మండలం కొండమోడు గ్రామానికి చెందిన రాడ్ బెండింగ్ మేస్త్రీ పోపూరి శ్యామ్ కుమార్ (40) మద్యం సేవించి చేతి మణికట్టు వద్ద సీసంతో కోసుకోవడంతో అధిక రక్తస్రావం జరిగి మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి ఫిట్స్ వ్యాధి ఉందని, అప్పులు కూడా ఉన్నట్లు సమాచారం. శ్యామ్‌కుమార్ బలవన్మరణానికి పాల్పడ్డాడా లేక ఎవరి ప్రమేయమైనా ఉందా ? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుని జేబులో కొండమోడు నుంచి సత్తెనపల్లి వరకు తీసుకున్న ఆర్టీసీ బస్సు టికెట్ ఉంది. శ్యామ్‌కుమార్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఏరియా వైద్యశాల మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ అర్చకుడు రంగాచార్యులు మృతి

సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులోని అలివేలు మంగ పద్మావతీ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ పూజారి చిత్రకవి రంగాచార్యులు అలియాస్ మురళి (67) గురువారం కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. 1956 మే 11న జన్మించిన ఆయన 2023 మే 11న తన జన్మదినం రోజే మరణించడం గమనార్హం. ఆలయ శ్రీవారి సేవా సమాజం కమిటీ సభ్యులు, భక్తులు ఆయన పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అచ్చంపేటలో క్రికెట్ టోర్నీ ప్రారంభం



కికెట్ టోర్నమెంటును ప్రారంభిస్తున్న అతిథులు

అచ్చంపేట: స్థానిక ఎస్సీ కాలనీలో స్టెల్లా యూత్ ఆధ్వర్యంలో కంభంపాటి నగేష్ స్మారక క్రికెట్ టోర్నమెంటును చర్చి సంఘ కాపరి రమికుమార్, ఇరిగేషన్ ఏఈ చిలకా భాస్కర్, వీఆర్వో సందెపోగు శేషయ్య తదితరులు ప్రారంభించారు. ముందుగా నగేష్ చిత్రపటానికి పలువురు పూల మాలలువేసి నివాళులర్పించారు. ఇరిగేషన్ ఏఈ భాస్కర్ మాట్లాడుతూ క్రీడాకారులలో స్నేహపూరిత పోటీ మాత్రమే ఉండాలని, గెలవాలన్న తపన ఉండాలని, గెలిచేందుకు చెడు మార్గాల వైపు పోకూడదని తెలిపారు. టోర్నీలో 10 జట్లు పాల్గొన్నాయి. తొలత జరిగిన 10 ఓవర్ల పోటీలో పూర్ణ సీసీ జట్టుపై రాజేష్ సీసీ జట్టు విజయం సాధించింది. పోటీలు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయని నిర్వాహకులు సందెపోగు శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పున్నారావు, శ్యాంసన్, కొత్తపల్లి దాసుబాబు పాల్గొన్నారు.

జేఈఈ ఉచిత శిక్షణకు నవోదయ విద్యార్థుల ఎంపిక

చిలకలూరిపేట టౌన్: జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులు నలుగురు దక్షణ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన జేఈఈ ఉచిత శిక్షణకు ఎంపికవ్వడం అభినందనీయమని విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు పేర్కొన్నారు. మండలంలోని మద్దిరాల విద్యాలయ ఆవరణలో గురువారం నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉన్న నవోదయ విద్యాలయాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు దక్షణ ఫౌండేషన్ స్వచ్ఛంద నిర్వహించిన పరీక్షల్లో మద్దిరాల జవహర్ విద్యాలయ విద్యార్థులు బి. జయంత్, వి. దేవానంద్, ఎస్. ధనూష్‌రెడ్డి, పి. బెనహర్ ప్రకాశ్ జేఈఈ ఉచిత శిక్షణకు ఎంపికైనట్లు చెప్పారు. వీరంతా నవోదయ విద్యాలయం కొట్టయంలో రెండు సంవత్సరాల ఇంటర్మీడియట్ విద్యతో పాటు ఫౌండేషన్ ఉచిత శిక్షణ ఇస్తుందని చెప్పారు. శిక్షణ అనంతరం ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన విద్యార్థులకు నాలుగు సంవత్సరాల పాటు ఇంజినీరింగ్ విద్య ఫీజుల్ని సంస్థ చెల్లిస్తుందని తెలిపారు.